నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 11-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:8 పేజీలు: 4 వెల: రూ.1/-

జమ్ముకశ్మీర్ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అయిన దృశ్యం

రాష్ట్రపతిని కలిసిన జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్

న్యూఢిల్లీ,ఆగస్ట్10: జమ్ముకశ్మీర్ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అయ్యారు. మనోజ్ సిన్హా గత శుక్రవారం జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌లోని తాజా పరిస్థితులను రాష్ట్రపతికి వివరించారు.

అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు

తాలిపేరు ప్రాజక్టుకు భారీగా వరదనీరు

తుంగభద్రకు పెరుగుతున్న వరద

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): రాబోయే 24గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అల్పపీడనం కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు పడుతున్నాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ బెంగాల్ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉంది. ఈ అల్పపీడనం ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహమూబాబాద్, ఖమ్మం జిల్లాలతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం చెప్పింది. వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు 18 గేట్లను ఎత్తివేసి 61,152 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఛత్తీస్‌గడ్, ఒడిషాలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏజెన్సీలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. మరోవైపు భద్రాచలం దగ్గర క్రమంగా గోదావరి నీటి మట్టం పెరుగుతోం ది. 19.6 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. వరుణుడు కరుణించడంతో రైతన్నలు వరినాట్లు వేస్తున్నారు. ఇక వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. వాగులు, వంకలు నీటితో పరవళ్లు తొక్కు తున్నాయి. పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో వర్షం నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో డ్రైనేజ్‌లు పొంగిపొర్లాయి. ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల పరిధిలో పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వరద జోరు కొనసాగుతోంది. దీంతో నీటి మట్టం పెరుగుతుంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా తుంగభద్ర డ్యాంకు వరద పరవళ్లు తొక్కుతోంది. సోమవారం డ్యాంకు లక్ష 16 వేల 827 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో వచ్చి చేరుతుండగా, అవుట్ ఎ÷-లో 8,514 క్యూసెక్కులు నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో 72.439 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ప్రస్తుతం 1624.85 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి విశ్వనాథ్ తెలిపారు. తుంగ డ్యాం నుంచి 49.261 క్యూసెక్కుల వరద టీబీ డ్యాంకు చేరుతుందని పేర్కొన్నారు.

వరదలపై ఆరు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష

న్యూఢిల్లీ,ఆగస్ట్10: దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా వర్షాలు కురుస్తుండటంతో పలు రాష్ట్రాలను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసోం, బీహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో నెలకొన్న వరదల పరిస్థితి గురించి ఆయా రాష్ట్రాల సీఎంలను అడిగి తెలుసుకున్నారు. వరదలను అంచనా వేయడానికి కేంద్రం, రాష్ట్రాల మధ్య మంచి సమన్వయం కోసం శాశ్వత వ్యవస్థ అవసరమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారీ వర్షాలు, వరదలపై సూచనలు, హెచ్చరికల వ్యవస్థను మెరుగుపరిచేందుకు వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని వారికి సూచించారు.నైరుతి రుతుపవనాలు, ప్రస్తుత వరద పరిస్థితులను ఎదుర్కోవటానికి అసోం, బీహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు చేపడుతున్న సహాయక చర్యలు, ఆయా ప్రభుత్వాల సన్నద్ధతను ప్రధాని మోదీ సమీక్షించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ అనయము త్రొక్కదనము లో
మనములలో నిలచి నట్టి 'మానీ'హీరో గా
జనవం దుర్రాం ధను మోంజి
సినిమా ప్రముఖుని "సునీల్ షెట్టి"ని దలతునే!!

(ఆగష్టు 11 హిందీ హీరో సునీల్ షెట్టి జననం) -రాధశ్రీ

సెల్: 9494481210

ఢిల్లీలో ముమ్మర తనిఖీలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చర్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలో భద్రతా చర్యల్లో భాగంగా ఢిల్లీ పోలీసు బలగాలు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించాయి. ఇండియా గేట్, కన్నాట్ ప్లేస్‌లో పోలీసులు, ఎన్‌సీఆర్‌లోని అన్ని ప్రాంతాల్లో భద్రతా బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఆదివారం, 74 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరుగుతున్న వేడుకల సందర్భంగా ఇండియన్ ఆర్మ్డ్ ఫోర్సెస్ (ట్రై సర్వీస్) బ్యాండ్ నార్త్ బ్లాక్‌లో సంగీత ప్రదర్శన ఇచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆర్మీ, నేవీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన బృందాలు సంగీత ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రదర్శనలు తమ ప్రాణాలకు ముప్పు ఉన్నా దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి అడ్డుకునేందుకు నిరంతరం పోరాడుతున్న కరోనా యోధుల పట్ల దేశం కృతజ్ఞతగా నిర్వహిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్టు 12న ఇంఫాల్, భోపాల్, ఝాన్సీల్లో కూడా

దేశంలో ఆగని కరోనా వైరస్ విజృంభణ

వరుసగా నాలుగో రోజూ 62 వేలకు పైగా కేసుల నమోదు

గత 24 గంటల్లో 1,007 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తున్నది. వరుసగా నాలుగో రోజు 62 వేలకు పైగా పాజిటివ్ కేసులతోపాటు, ఎనిమిది వందలకు పైగా మరణాలు నమోదయ్యాయి. తాజాగా రికార్డు స్థాయిలో వెయ్యికి పైగా కరోనా మరణాలు నమోదయ్యాయి. దీంతో మొత్తం మరణాలు 44 వేలు దాటాయి.

దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 1,007 మంది కరోనా బాధితులు మరణించారు. ఇంతపెద్ద సంఖ్యలో కరోనా బాధితులు మరణించడం ఇదే మొదటి సారి. అదేవిధంగా నిన్న ఉదయం నుంచి ఈరోజు ఉదయం వరకు 62,064 మంది కొత్తగా కరోనా బారినపడ్డారు. దీంతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 22,15,075కు పెరగగా, మరణాలు 44,386కు చేరాయి. ఇప్పటివరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 6,34,945 కేసులు యాక్టివ్‌గా ఉండగా, 15,35,744 మంది బాధితులు కోలుకున్నారు. దీంతో దేశంలో కరోనా బారి నుంచి కోలుకున్నవారి సంఖ్య 15 లక్షలు దాటిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. దేశవ్యాప్తంగా కొత్తగా నమోదవుతున్న పాజిటివ్ కేసుల్లో 80 శాతం పది రాష్ట్రాల్లోనే ఉన్నాయని తెలిపింది. దేశవ్యాప్తంగా నిన్నటివరకు 2,45,83,558 కరోనా టెస్టులు చేశామని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్మార్) ప్రకటించింది. ఆగస్టు 9న 4,77,023 నమూనాలను పరీక్షించామని వెల్లడించింది

ప్రపంచవ్యాప్తంగా 2కోట్లు దాటిన కేసులు

మృతుల సంఖ్య 7,33,973కి చేరిక

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా కల్లోలం సృష్టిస్తూనే ఉంది.. ఏకంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రెండు కోట్లు దాటిపోయింది... ఇక, ప్రపంచంలోని ఇతర దేశాల కంటే భారత్‌లోనే కరోనా కేసులు సంఖ్య స్పీడ్‌గా దూసుకెళ్తోంది.. ప్రస్తుతం దేశంలో ప్రతీరోజూ 60 వేలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఏకంగా ఒక్కరోజే పాజిటివ్ కేసులు 62 వేలు దాటిపోయింది.. కరోనా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2,00,23,016కు చేరగా.. ఇప్పటివరకు మృతిచెందినవారి సంఖ్య 7,33,973కి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 3 లక్షల కొత్త కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు, కరోనాబారినపడి కోలుకున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా.. ఇప్పటి వరకు 1,28,97,813 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ప్రపంచంలో కరోనా కేసుల్లో అగ్రరాజ్యం అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతూనే ఉంది. అమెరికాలో ఇప్పటివరకు 51,99,444 మంది కరోనా బారినపడ్డారు. వారిలో 26,64,701 మంది కోలుకున్నారు. 23,69,126 మంది చికిత్స పొందుతున్నారు. ఇక, ఇప్పటివరకు 1,65,617 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇండియాలో పాజిటివ్ కేసుల సంఖ్య 22,15,075గా ఉంది. ఇప్పటివరకు 44,386 మంది కరోనాతో మృతిచెందారు.

కొత్తగా 1,256 కరోనా పాజిటివ్ కేసులు

మృతుల సంఖ్య 637కి చేరిక

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): గడిచిన 24గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 1,256 కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలోనే 389 ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య 80,751కి చేరాయి. వైరస్ ప్రభావంతో మరో 10 మంది మృతి చెందగా, మృతుల సంఖ్య 637కి చేరింది. ప్రస్తుతం 22,528 మంది బాధితులు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. నిన్న ఒక్క రోజు 11,609 నమూనాలను పరిశీలించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటి వరకు 6,24,840 నమూనాలు పరీక్షించినట్లు వివరించింది. ఇంకా 1,700 నమూనాల

ఫలితాలు రావాల్సి ఉందని పేర్కొంది. తాజాగా 1,587 మంది కోలుకొని డిశ్చార్జి కాగా, ఇప్పటి వరకు 57,586 మంది వైరస్ నుంచి కోలుకున్నారు. తెలంగాణలో రికవరీ రేటు 71.31 శాతంగా ఉందని, ఇది దేశ సగటుకు కంటే ఎక్కువ అని పేర్కొంది. దేశంలో కరోనా రికవరీ రేటు 68.78గా ఉంది. మరో 15,789 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌కు కరోనా

కలసిన వారంతా స్వీయ నియంత్రణ పాటించాలని సూచన

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి దేశాన్ని గజగజ వణికిస్తోంది. కరోనా ఉధృతికి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు కరోనా సోకిన విషయం విదితమే. తాజాగా మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కూడా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. తనకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు ప్రణబ్ ముఖర్జీ ట్వీట్ చేశారు. వేరే సమస్య వల్ల ఆస్పత్రికి వెళ్లినప్పుడు.. తనకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో తనకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. గత వారం రోజుల నుంచి తనను ఎవరైతే కలిశారో.. వారందరూ కరోనా పరీక్షలు చేయించుకోవాలి అని మాజీ రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ పరీక్షలు చేయించుకున్న తర్వాత స్వీయ నియంత్రణ పాటించాలని ప్రణబ్ ముఖర్జీ కోరారు.

హకీ క్రీడాకారుడు మన్‌దీప్ సింగ్‌కు పాజిటివ్

జాతీయ హాకీ జట్టులో ఈ వైరస్ మహమ్మారి కలకలం రేపుతోంది. గతంలో కెప్టెన్ మన్‌ప్రీత్‌సింగ్‌తో సహా మరో ఐదుగురు జట్టు సభ్యులకు సోకిన కరోనా వైరస్.. తాజాగా మరో ఆటగాడు మన్‌దీప్‌సింగ్‌కు కూడా సోకింది. బెంగళూరు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ)లోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వద్ద జరిగిన జాతీయ శిబిరంలో 20 మంది ఆటగాళ్లకు కరోనా పరీక్షలు చేయగా అందులో మన్‌దీప్‌సింగ్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఎస్ఏఐ సోమవారం వెల్లడించింది. అయితే అతడికి ఎలాంటి లక్షణాలు లేవని, ప్రస్తుతం వైద్యుల సమక్షంలో చికిత్స పొందుతున్నాడని తెలిపింది. మరో ఐదుగురికి కూడా డాక్టర్లు చికిత్స అందిస్తున్నట్టు ఎస్ఏఐ ఓ ప్రకటనలో తెలిపింది.

హైదరాబాద్ బైరామల్ గూడ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిచిన మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ ఉన్నారు.

నగరంలో అందుబాటులోకి మరో ఫ్లై ఓవర్

బైరామల్‌గూడ ఫ్లై ఓవర్‌కు కెటిఆర్ ప్రారంభం

రూ. 26.45 కోట్లతో ప్రత్యేక టెక్నాలజీతో నిర్మాణం

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): పెరుగుతున్న ట్రాఫిక్‌ను అరికట్టేందుకు రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్లను చేపట్టామని మంత్రి కెటిఆర్ అన్నారు. నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగతున్నామని అన్నారు.

నగరంలోని బైరామల్‌గూడ ఫ్లై ఓవర్‌ను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఎస్సార్‌డీపీలో భాగంగా చేపట్టిన పనుల్లో ఈ ఫ్లై ఓవర్ ఒకటి. ఎల్‌బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడ జంక్షన్ వద్ద రూ. 26.45 కోట్లతో దీనిని పూర్తి చేశారు.

ఎస్సార్‌డీపీ ప్యాకేజీ-2లో మొత్తం 14 పనులుండగా, ఇప్పటికే ఐదు వినియోగంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఫ్లై ఓవర్ ప్రారం భంతో బైరామల్‌గూడ జంక్షన్, సాగర్‌రోడ్ జంక్షన్‌ల పరిధిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గనుం ది. బైరామల్‌గూడ జంక్షన్‌లో రద్దీ వేళల్లో గంటకు 12 వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఒవైసీ జంక్షన్‌కు, శ్రీశైలం వైపు వెళ్లే వాహనదారులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఫ్లై ఓవర్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే ఉద్దేశంతో.. బైరామల్‌గూడ జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మించినట్లు వెల్లడించారు. రూ. 26.45 కోట్ల అంచనాతో 784 మీటర్ల పొడవుతో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఎస్ఆర్‌డీపీ ప్యాకేజీ 2లో రూ. 448 కోట్ల అంచనా వ్యయంతో ఎల్బీనగర్ నియోజక వర్గం లో చేపట్టిన 14 పనులలో ఇప్పటి వరకు 6 పూర్తి అయ్యాయి. ఇప్పటికే ఎల్బీనగర్ జంక్షన్‌లో నిర్మించిన కుడి వైపు ఫ్లై ఓవర్ తో పాటు అండర్ పాస్, కామినేనీ జంక్షన్‌లో కుడి వైపుతో పాటు ఎడమ వైపు ఫ్లై ఓవర్ , చింతల్ కుంట అండర్ పాస్‌లు అందుబాటులోకి రావడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ఫ్రీ ఫ్లో ట్రాఫిక్ నగరంగా మార్చేందుకు ఎస్.ఆర్.డి.పి కింద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను చేపట్టింది జీహెచ్ఎంసీ.. బైరమల్ గూడ జంక్షన్‌లో నిర్మించిన కుడివైపు ఫ్లై ఓవర్ నిర్మాణానికి దేశంలోనే మొదటిగా ప్రత్యేక టెక్నాలజీని వినియోగించారు.

బడుగులను ఐక్యం చేసిన సర్వాయి పాపన్న

-వారోత్సవాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): సర్దార్‌సర్వాయిపాపన్న బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని సాధించి చూపించిన గొప్ప చక్రవర్తిగా ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభివర్ణించారు. పాపన్న గౌడ్ ఒక్క గౌడ సామాజిక వర్గానికే కాకుండా బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేసి రాజ్యాధికారం వైపు నడిపించిన గొప్ప సామాజిక స్ఫూర్తి ప్రదాత అని ఆయన పేర్కొన్నారు. ఈనెల 18న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 370వ జయంతి పురస్కరించుకుని జాతీయ వారోత్సవాలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమాన్నిగత 14 సంవత్సరాలుగా జైగౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన ప్రముఖులు, రాజులు, వైతాళికులు , పండితులు, సాహితీవేత్తలు, కవులు, చారిత్రక పురుషులు, మహనీ యులను గుర్తించి వారి చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని, ఆశయాలను కొనసాగిస్తూ వారి జన్మదినం, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ చరిత్ర అంటేనే సామాన్యుల చరిత్ర అన్నారు. చీమలన్నీ కలిసి కొండ చిలువను ఓడించినట్టుగా సకల జనులు, సబ్బండ వర్గాల ప్రజలందరూ కేసీఆర్ నాయకత్వంలో ముందుకురికారు. తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. సామాన్య గీత కార్మికుడి నుంచి చక్రవర్తి వరకు ఎదిగి ఢిల్లీ పాలకులను ఎదిరించిన వీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఖిలాషాపురం, జాఫర్‌గఢ్, భువన గిరి, తాటికొండ, వరంగల్ సర్వాయి కోటలను నిర్మించడంతో పాటు చారిత్రాత్మక గోల్కొండ కోటను ఆక్రమించి ధర్మపరిపాలన చేసిన బహుజన చక్రవర్తిగా చరిత్రలో కీర్తి గడించారని అన్నారు. కానీ పాపన్న చరిత్రను కొందరు మరుగున పడేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వాయి పాపన్నచరిత్రను నిర్లక్ష్యం చేశారని చెప్పారు.

భయాన్ని వీడుదాం..అవగాహనతో కరోనాను జయిద్దాం

రంగారెడ్డి,ఆగస్ట్10: ప్రభుత్వం కరోనాను ఎదుర్కోవటానికి అనునిత్యం కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకి కన్సర్న్ సంస్థ అందించిన నూతన అంబులెన్స్ ను ఎమ్మెల్యే కాలె యాదయ్య , జడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ కరోనా కట్టడికి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి లక్షలు ఖర్చు పెట్టుకోవద్దని సూచించారు.

ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఒకే రకమైన వైద్యం అందుతుందన్నారు. కరోనా సోకితే ఆందోళన చెందకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. చేవెళ్ల దవాఖానలోని ఐసీయూ సెంటర్ కు ఏడు బెడ్ల తో పాటు రూ. 25 లక్షల విలువైన అంబులెన్స్ ఇచ్చిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. వీటితో పాటు కొండాపూర్, షాద్ నగర్ దవాఖానలకు అంబులెన్స్ లు ఇవ్వటంతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు మూడు కోట్లతో వివిధ దవాఖానల్లో అంబులెన్స్ ల తో పాటు సౌకర్యాల కల్పనకు కన్సర్న్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటినిజం
మంగళవారం 11-8-2020

ప్రపంచానికి కొత్త సవాల్

ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్ లక్షణాలు ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా కనిపిస్తున్నాయి. కొంతమందికి ఎలాంటి లక్షణాలు లేకుండానే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. కొంతమందికి స్పల్ప లక్షణాలు కనిపిస్తున్నాయి. దాదాపు 40 శాతం కరోనా రోగులకు లక్షణాలు కనిపించడం లేదని పరిశోధకులు అప్పటికే పేర్కొన్నారు. మనదేశంలో అలాంటి కేసులు చాలా ఉన్నాయి. కేవలం జ్వరం, దగ్గు,జలుబు వంటి లక్షణాలు కూడా లేకుండా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. భారతదేశంలో రోజురోజుకు కరోనా మహమ్మారి విజృంభిస్తూనే ఉంది. కరోనా కట్టడికి ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం ఉండటం లేదు. ప్రస్తుతం దేశంలో కరోనా కేసుల సంఖ్య రెండు మిలియన్లు దాటిపోయింది. 10 లక్షల కరోనా కేసులు దాటిన రోజు నుంచి వచ్చిన కొత్త కేసులలో దాదాపు 38 శాతం ఐదు రాష్ట్రాల నుంచే వచ్చాయి. అవి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలుగా గుర్తించారు. ఈ రాష్ట్రాలలో జూలై 16కి ముందు 19 శాతం కన్నా తక్కువ కేసులు నమోదయ్యాయి. అసింప్టమాటిక్ వల్ల ప్రజలు కరోనా బారిన పడ్డా తెలియడం లేదు. తీరా వ్యాధి ముదరికా తెలుసుకోవడం..మృత్యువాత పడడం చకచకా సాగిపోతున్నాయి. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కొవిడ్-19 గురించి రోజుకో దుర్వార్త తెలుస్తోంది. టీకా వచ్చేలోపు ఎంతమంది ఈ మహమ్మారికి బలవుతారో తెలియక ఆందోళన నెలకొంది. అయితే, తాజాగా, దీని గురించి మరో చేదునిజం తెలిసింది. కరోనా నివురుగప్పిన నిప్పులా వ్యాపిస్తుందని ఓ అధ్యయనంలో తేలింది. ఎలాంటి వ్యాధి లక్షణాలులేని కరోనా పాజిటివ్ వ్యక్తులు ఆరోగ్యంగా కనిపించి నప్పటికీ ఇతరులకు వైరస్‌ను వ్యాప్తి చేయగలరని దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు తేల్చారు. అలాగే, కొందరికి వ్యాధి బాగా ముదిరాక రెండు రోజుల ముందు మాత్రమే లక్షణాలు కనిపిస్తున్నాయని గుర్తించారు. దీన్నే ప్రీసింప్టామెటిక్ ఫేస్ అంటారని, వారు కూడా ఎలాంటి లక్షణాలు లేకున్నా సింప్టమ్స్ ఉన్నవారితో సమాన స్థాయిలో వైరస్‌ను కలిగి ఉంటారని నిర్ధారించారు. దాదాపు 40శాతం కరోనా రోగులకు లక్షణాలు కనిపించడం లేదని ప్రముఖ పరిశోధకురాలు, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో అంటు వ్యాధి వ్యాధుల నిపుణురాలు మోనికా గాంధీ పేర్కొంది. బోస్టన్ నిరాశ్రయుల ఆశ్రయంలో దాదాపు 147 మందికి కరోనా సోకితే.. 88 శాతం మందికి లక్షణాలే లేవని తమ పరిశోధనలో తేలిందని మోనికా గాంధీ పేర్కొన్నారు. 481 మంది కరోనా బారిన పడితే.. 95 శాతం మందికి ఎలాంటి లక్షణాలు లేవని తేలింది. అర్కాన్సాస్, నార్త్ కరోలినా, ఒహియో మరియు వర్జీనియాలోని జైళ్లలోని 3,277 ఖైదీలు కోవిడ్ బారిన పడగా.. 96శాతం మందిలో ఒక్క లక్షణం కూడా కనిపించలేదు. తీవ్ర లక్షణాలు కనిపించిన వారితో కలిసి ఉన్నవారిలో కొంతమందికి కరోనా సోకలేదు. దీనికి గల కారణాలు అంతుచిక్కడం లేదు. రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వల్లే వీరికి కోవిడ్ సోకలేదా? లేదా కరోనా వైరస్ మోతాదులో తేడా వల్ల వీరు కోవిడ్ బారిన పడలేదా అనేది మిస్టరీగా మారింది. అయితే ఈ మిస్టరీని చేధిస్తే టీకా లేదా వ్యాక్సిన్ అభివృద్ధిని వెగవంతం చేయవచ్చని గాంధీ అభిప్రాయపడ్డారు. అలాగే రోగ నిరోధక శక్తికి కొత్త మార్గాలు సృష్టించవచ్చని చెప్పారు. ఈ దశగా పరిశోధనలు సాగిస్తే కరోనా మహమ్మారి వ్యాప్తిని అరికట్టడమే కాకుండా దానిని నాశనం చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఏదేమైనా అధిక శాతం మందికి కరోనా లక్షణాలు కనిపించకపోవడం మంచి పరిణామం అని, సమాజానికి ఇది మంచి విషయం అని గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలో నమోదయిన మొదటి 10 లక్షల కేసులలో దాదాపు 12 శాతం కేసులు ఢిల్లీ నుంచి నమోదు అయ్యాయి. రెండవ మిలియన్‌లో మాత్రం 3 శాతం కన్నా తక్కువ కేసులు వచ్చాయి. ఈ గణాంకాలను పరిశీలిస్తే

కరోనా వ్యాప్తి గత మూడు వారాల్లో భౌగోళికంగా ఎలా మారిందో అర్థం అవుతుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీలో కాకుండా దక్షిణ భారతదేశంలో ఎక్కువ వ్యాప్తి చెందుతోంది. అలాగే దేశంలో వైరస్ వ్యాప్తి చెందుతున్న విధానంలో చాలా మార్పులు వచ్చాయి. ఢిల్లీ లాంటి ప్రాంతాల్లో కరోనా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దాదాపు ఐదవ వంతు కేసులు మహారాష్ట్రలోనే నమోదవుతున్నాయి. తరువాత దాదాపు 16శాతం కేసులతో ఆంధ్రప్రదేశ్ ఎనిమిదవ స్థానం నుంచి రెండవస్థానానికి చేరుకుంది. తమిళనాడు రెండవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రాల్లో ఎక్కువగా కరోనా పరీక్షలు చేస్తుండటం వల్లే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. కరోనావైరస్ సంక్రమణతో బాధపడుతున్న చాలా మంది సుదీర్ఘకాలం ఎలాంటి లక్షణాలు లేకుండా ఉండగలరని తేల్చారు. 29శాతం మంది రోగులకు అసలు లక్షణాలే బయటపడలేదని కనుగొన్నారు. వీరు వైరస్ ఇంక్యుబేషన్ పీరియడ్‌తో సంబంధం లేకుండా 14 రోజుల తర్వాత కూడా వైరస్‌ను వ్యాప్తిం చెందించగలరని తెలిపింది. ఎలాంటి లక్షణాలు లేకుండా అధిక వైరల్ భారాన్ని మోసే వ్యక్తులు ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందే అవకాశాన్ని పెంచుతున్నారు. కచ్చితంగా అందరూ మాస్కులు ధరించడం, సామాజిక దూరాన్ని పాటించాలని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది. యూనివర్సల్ మాస్కింగ్ అనేది వైరస్‌ను పీల్చుకునే మొత్తాన్ని తగ్గిస్తుందని ఈ స్టడీ చెబుతోంది. ఈ అధ్యయనం ఫలితాలు జామా ఇంటర్నల్ మెడిసిన్ పత్రికలో ప్రచురితమయ్యాయి.

అండగా నిలుస్తున్న హెల్ప్‌లైన్

-కరోనా పేషెంట్లకు ఆన్‌లైన్‌లో ఉచితంగా సహకారం

మంచిర్యాల,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): కొవిడ్ వైరస్ సోకి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వారికి ఆపదలో ఆదుకొనేందుకు హెల్ప్‌లైన్ అండగా నిలుస్తోంది. సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కరోనా పేషెంట్లకు ఆన్‌లైన్‌లో ఉచితంగా డాక్టర్ కన్సల్టేషన్‌తోపా టు ఇతర సహాయ సహకారాలు అందజేస్తోంది. ఇందు కోసం 9676733 230 సెల్ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. వైద్యులతో మాట్లాడిస్తూ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర సమాచారాన్ని అంద జేస్తున్నారు. నిరుపేదలైన కరోనా పేషెంట్లకు సంస్థ ఆధ్వర్యంలో ఉచితం గా ఆక్సీ మీటర్, థర్మామీటర్‌తోపాటు వైద్యుల సూచనల మేరకు మందులతో కూడిన రూ.2500 విలువగల కిట్లను అందజేస్తున్నటళల్లు సంస్థ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. జిల్లాలో కొవిడ్ వైరస్ వేగంగా విస్తరిస్తోంది. కరోనా బారినపడి వేల సంఖ్యలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో వైరస్ శరవేగంగా విస్తరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వృద్ధులపై వారిపై కరోనా పంజా విసురుతోంది. మృతుల్లో 50 సం వత్సరాలకు పైబడ్డ వారే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అత్యధిక కేసులు జిల్లాకేంద్రంలో నమోదవుతుండగా, తరువాత స్థానంలో బెల్లంపల్లి ఉంది. నస్పూర్ మున్సిపాలిటీలో కూడా అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 17 మరణాలు సంభవించగా అందులో 12 మంది హైద్రాబాద్‌లోని వివిధ ఆసుపత్రుల్లో మరణించారు.

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితోపాటు వివిధ మండలాల్లోని పీహెచ్‌సీల్లో వైరస్ లక్షణాలు గల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరోనా సోకిన బాధితులను వారి ఆరోగ్య స్థితిగతులను బట్టి హోంక్వారంటైన్ లేదా బెల్లంపల్లిలోని సింగరేణి ఐసోలేషన్ సెంటర్‌గానీ, హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరితోపాటు అధిక సంఖ్యలో లక్షణాలు గల వారు నేరుగా హైద్రాబాద్, కరీంనగర్‌లలో పరీక్షలు చేయించుకుంటున్నారు. రిపోర్టులు పాజిటివ్‌గానీ, అనుమానిత లక్షణాలుగానీ రాగానే అక్కడే చికిత్స పొందుతున్నారు.

కరోనా సమస్యలు కానరాని చిత్తశుద్ధి

వరంగల్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): రైతుల గురించి గొప్పలు చెబుతున్న సిఎం కెసిఆర్ వారి సమస్యలపై ఏనాడు కూడా ఎందుకు చర్చించలేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. కరోనాపైనా తగిన శ్రద్ధ లేదన్నారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టి రాష్ట్రంలో కుటుంబ పరిపాలన సాగుతోందని అన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలతో పోరాడి తెలంగాణ సాధిస్తే దొరల పాలనను మరిపించేలా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే పదవులు దక్కాయన్నారు. చదువుకున్న విద్యార్థులను నిరుద్యోగులుగా మారుస్తున్నారని మండి పడ్డారు. గొర్రెలు, బర్రెలిస్తూ రోజుకో విధంగా గారడి మాటలతో అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తోందన్నారు. మహిళలపై రోజుకో విధంగా దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణలో సామాజికంగా, ఆర్థికంగా, పేదలకు న్యాయం జరగాలంటే రాష్ట్రంలో తెదేపాను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు కలసికట్టుగా ముందుకు సాగుతూ ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత పాలనను ప్రజలకు వివరించాల్సిన అవసరముందన్నారు.

మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై కస్టమర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టవలసిందిగా సూచించిన కేంద్ర మంత్రి పియూష్ గోయల్

హైదరాబాద్, ఆగష్టు 10:ఆత్మనిర్భర్ భారత్ ప్రచారానికి సంపూర్ణంగా తమ వంతు సహకారం అందించాలని కేంద్ర వాణిజ్య , పరిశ్రమలు, రైల్వే శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ ట్రేడర్లను కోరారు. ఈరోజు జాతీయ వర్తకదినోత్సవం సందర్భంగా వర్చువల్ సమావేశం ద్వారా ఆయన వర్తకులనుద్దేశించి మాట్లాడుతూ , ఇండియాలో తయారైన ఉత్పత్తులను కొనాల్సిందిగా కస్టమర్లను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన వారిని కోరారు. మనతో స్నేహసంబంధాలు లేని దేశాలనుంచి నాసిరకం ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్న ట్రేడర్ల చర్యల తీరును బయటపెట్టాలని అందుకు చైతన్యవంతులుగా ట్రేడర్లు కృషి చేయాలని ఆయన కోరారు.ఆత్మనిర్భర్ భారత్ ప్రచారం వల్ల వర్తకులు ఎంతగానో ప్రయోజనం పొందుతారని ఆయన తెలిపారు. ఇండియాలో తయారైన ,మంచి నాణ్యతగల వస్తువులు ఆర్థిక వ్యవస్థలో పెద్ద సంఖ్యలోకి వచ్చి చేరితే ధరలు తగ్గుతాయని, దీనితో ఇవి అంతర్జాతీయ మార్కెట్‌లో పోటికి నిలబడ గలగుతాయని పియూష్ గోయల్ తెలిపారు. ఇది మరిన్ని ఉపాధి అవకాశాలకు , ప్రజల సుసంపన్నతకు , ప్రజలకు మరింత కొనుగోలుశక్తి పెరగడానికి ఉపకరిస్తుందని చెప్పారు. దిగుమతి చేసుకునే చాలా వస్తువులపై ప్రభుత్వం ఇప్పటికే ఆంక్షలు విధించిందని ఇలాంటివి దేశంలో సులభంగా తయారు చేసుకోవచ్చని చెప్పారు. అగర్‌బత్తీలు, క్రీడా ఉపకరణాలు, టివి, టెలిఫోన్, టైర్లు వంటివి ఇందులోకి వస్తాయి. సుమారు పది వేల కోట్ల రూపాయల విలువగల దిగుమతులకు బదులుగా దేశీయ ఉత్పత్తులు వాడవచ్చని పియూష్ గోయల్ అన్నారు. స్థానిక ఉత్పత్తులు వినియోగించాల్సిందిగా బలంగా ప్రచారం చేయాలని, ప్రధానమంత్రి పిలుపునిచ్చినట్టుగా , ఓకల్ ఫర్ లోకల్ నినాదాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ట్రేడర్లు నిర్వర్తించిన పాత్రను శ్రీ పియూష్ గోయల్ కొనియాడారు. పరిస్థతులకు తగినట్టుగా స్పందించి దేశంలోని ప్రతి మారుమూల ప్రాంతానికీ అత్యావశ్యక సరుకులు అందుబాటులో ఉండే విధంగా ట్రేడర్లు చూశారని ఆయన కొనియాడారు. క్లిష్టసమయంలో ట్రేడర్లునిర్వర్తించిన పాత్రను ప్రధానమంత్రి సైతం గుర్తించారని, దీనినే తమ మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధానమంత్రి ప్రస్తావించారని చెప్పారు. వినియోగదారుడికి, ఉత్పత్తి దారుడికి మధ్య ట్రేడర్ కీలక వారధిగా వ్యవహరించారని అన్నారు...ట్రేడర్లు వివిధ బృందాలుగా ఏర్పడి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి, వివిధ ట్రేడ్ లనుంచి సూచనలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు. ఒక సైజు అందరికీ పట్టనట్టే , వివిధ రంగాలకు సంబంధించి ప్రత్యేక సిఫార్సులు చేయాల్సిందిగా ఆయన వారిని కోరారు. ఈ సిఫార్సులన్నింటి పట్ల ప్రభుత్వం ఉదారంగా ఉంటుందని ఆయన అన్నారు. ఆన్‌లైన్ ద్వారా లైసెన్సుల జారీ, లైసెన్సు ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు, లైసెన్సు కాలానికి ఎక్కువ వ్యవధి ఉండేట్టు చూడడం, క్రిమినల్ నేరాలుగా పరిగణించకుండా ఉండే విధంగా చట్టాలలో మార్పులు, చట్టాన్ని అమలు చేసే అధికార యంత్రాంగానికి విచక్షణాధికారాల తొలగింపు, నిబంధనలు సులభతరం చేయడం వంటివి ట్రేడర్ల డిమాండ్లుగా ఉన్నాయి. అయితే మొసాలకు పాల్పడే వారిని ఒంటరి చేయాలని ,లేకుంటే , మొత్తం ట్రేడర్లసమాజానికే చెడ్డ పేరు వస్తుందని , ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రయోజనాలు దుర్వినియోగం అవుతాయని ఆయన అన్నారు.

పోరాటం అద్వానీదైతే..ఫలితం మోడీది

ప్రజల్లో గుండెల్లో గూడుకట్టుకుంటున్న మోడీ
కాంగ్రెస్ ముక్త భారత్ దిశగా కార్యాచరణ

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): పోరాటం అద్వానీది అయితే ఫలితం మాత్రం పరేంద్ర మోడీ దక్కించు కున్నారు. 2014 ఎన్నికల సమయంలో అద్వానీని కాదని తెరపైకి మోడీని తెచ్చారు. దీనిని అద్వానీ కూడా వ్యతిరేకించారు. అయినా ఆయన ఇష్టాన్ని పక్కన పెట్టి మోడీని సారథిగా ప్రకటించారు. దీంతో అద్వానీ ఇన్నేళ్ల శ్రమ వృదా అయ్యింది. ఆయనకు ప్రధాని అయ్యే ఛాన్స్ దక్కలేదు. కనీసం రాష్ట్రపతిగా అయినా గౌరవం దక్కుతుందనుకున్నా అదీ దక్కలేదు. దీంతో కురువృద్ధుడు అయిన అద్వానీ బిజెపి కోసం శ్రమించినా ఆయనకు ఫలితం దక్కలేదు. ఇకపోతే అయోధ్య విషయంలో కూడా అదే జరిగింది. పోరాట వీరుడు అద్వానీ అయితే ఫలితం మాత్రం ఇప్పుడుమోడీ ఖాతాలో చేరింది. అయితే సుప్రీం తీర్పు అనుకూలంగా రావడంలో ఆయన పాత్ర ఎనలేనిదని చెప్పుకోవాల్సిందే. ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్యలో రామ మందిరానికి భూమి పూజ చేయడం ద్వారా భక్తుల మనసులను కొల్లగొట్టారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొవిడ్ గురించి జనం తాత్కాలికంగా మరచిపోయారు. శతాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించడం మోదీకి మాత్రమే సాధ్యమైందని దేశ ప్రజలు కొనియాడుతున్నారు. నిజానికి శతాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు మోడీ పరిష్కారం చూపారనే చెప్పాలి. జాతీయ స్థాయిలో రామ మందిరం నిర్మాణానికి భారీ మద్దతు దక్కింది. ఎన్నారైలు కూడా అపూర్వ స్వాగతం పలికారు. ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న ఆశలను సాకారం చేసిన నేతగా మోడీ ప్రజలకు బాగా దగ్గరయ్యారు. రామాలయానికి భూమిపూజ జరిగిన ఆగస్టు 5వ తేదీకి సరిగ్గా ఏడాది ముందు అదే తేదీనాడు ఒక దేశం.. ఒకే చట్టం అనే తన చిరకాల స్వప్నాన్ని మోదీ ప్రభుత్వం సాకారం చేసుకున్నది. దేశంలో ఎక్కడా పెద్ద వ్యతిరేకత కనిపిం చనీయకుండా 370వ అధికరణాన్ని చాకచక్యంగా రద్దు చేయగలి గింది. భూమిపూజ తర్వాత రెండు రోజులకే ప్రధాన మంత్రి ఒక సెమినార్‌లో మాట్లాడుతూ ఒక దేశం ఒకే విద్య అని మరో పిలుపునిచ్చారు. ఈమేరకు నూతన విద్యావిధానాన్ని ఇప్పటికే కేంద్ర కేబినెట్ ఆమోదిం చింది. ఇప్పు డున్న విద్యావిధానం రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అమ లులోకి వచ్చింది. ఆదర్శాలు ఎలా ఉన్నా ఆచరణలో ఈ విధానం విద్యను అంగడి సరుకుగా మార్చివేసింది. ఈ చేదు అనుభవం ఫలితంగానే, కొత్త విద్యావిధానాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. ప్రైవేట్ దోపిడీదార్ల పాలిటి కామధేనువు లాంటి ఇంటర్మీడియట్ అదృశ్యం కాబోతున్నది. ఈ కొత్తవిధానం అమలులోకి రావడానికి ఆటంకాలేమీ కనిపించడం లేదు. ఒక దేశం.. ఒకే చట్టం... ఒకే విద్య... తర్వాత వచ్చే ఆ ఒక్కటి ఏమై ఉంటుందన్న చర్చ సాగుతున్న వేళ మోడీ తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' తన విధానంగా బీజేపీ ఎప్పుడో ప్రకటించు కున్నది. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా పతనమైతే ఇక మిగిలే జాతీయ పార్టీ బీజేపీ ఒక్కటే. మిగిలిన జాతీయ పార్టీలు పేరుకే తప్ప వాటి ఉనికి నామమాత్రమే. దేశంలో ఉన్న 28 రాష్ట్రాల్లో కేవలం 8 రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ తన ఉనికిని బలంగా చాటుకునే పరిస్థితిలో ఉన్నది. అందులో జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలట్ల రూపంలో రెండు రాష్ట్రాల్లో గట్టి ఎదురుదెబ్బలే తగిలాయి. రామాలయ రూపంలో ముంచుకు వచ్చిన ముప్పును ముందే గ్రహించిన ప్రియాంకాగాంధీ రామమందిరం భూమి పూజను బహిరంగంగా స్వాగతించారు. అయినా ఇప్పట్లో మోడీని ఢీకొనడం ఎవరి తరం కాకపోవచ్చు. అద్వానీ కూడా చరిత్రకు సాక్షీభూతంగా మౌనమునిగా ఇప్పటికే మిగిలారు.

ప్రాజెక్టులపై ఇక విమర్శలు మానాలి

తెలంగాణలో జల విప్లవం కెసిఆర్‌తోనే సాధ్యమయ్యింది
-కాంగ్రెస్ విమిర్శలకు మండిపడ్డ గంగుల

కరీంనగర్,ఆగస్ట్10(నేటినిజం ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేస్తున్న వారు ఇప్పుడు గోదావరి పరవళు ్లచూసి మాట్లాడాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కాళేశ్వరంతో కలనెరవేరబోతున్న తరుణంలో ఇక విమర్శలు కట్టిపెట్టాలన్నారు. ప్రాజెక్టులు, నీటి వాటాలపై సిఎం కెసిఆర్‌కు ఉన్న పట్టుదల కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. రాజకీయ ప్రయోజనాలే కాంగ్రెస్ ఎజెండా అని మండిపడ్డారు. దేశంలోనే మొదటిసా రిగా తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం రైతుల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తూ,ఉచితవిద్యుత్‌ను అందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసేందుకు ఉద్యమిస్తోందని అన్నారు. భీమాతో రైతుల కుటుంబాలకు దీమా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టుబడి సాయం నిరంతరాయంగా కొనసాగిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు తుడచడానికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలోనే మెదటిసారిగా ఇలాంటి పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. గతంలో రైతుల సంక్షేమం కోసం ఇన్ని కార్యక్రమాలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు ద్వారా ఎకరాకు రూ. పదివేలను అందిస్తున్న ఘనత దేశంలో తెలంగాణలో మత్రమే ఉంద న్నారు. దేశ చరిత్రలో సీఎం కేసీఆర్ మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రం లోని రైతులందరికీ వర్తించేలా రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టి వారి కుటుంబాల్లో ధైర్యం కల్పించారని అన్నారు. రైతులు ఆత్మహత్యల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం అందించే సాయంతో పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలని చారి అన్నారు. రైతుల కష్టాలు తీర్చాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ సర్కారు రైతు పక్షాన నిలబడి దేశం గర్వించేలా నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. కాళేశ్వరంసహా చేపట్టిన అన్నిప్రాజెక్టులు సాకారం కాబోతున్నాయని అన్నారు

నూతన పారిశ్రామిక విధాన పత్రాన్ని ఆవిష్కరించిన సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి గౌతం రెడ్డి, ఎపిఐఐసి ఛైర్ పర్సన్ రోజా

భూ వివాదాల పరిష్కారంలో నిర్లక్ష్యం

రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని వైనం

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): భూసమస్యలు కుప్పలుతెప్పలుగా వెలుగు చూస్తున్నాయి. భూప్రక్షాళన చేపట్టినా 20 శాతం దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మ్యూటేషన్‌ల లోనూ ఫోర్జరీ, ఒకరి భూమి మరొకరి పేరిట, ఒకే భూమి ఇద్దరు, ముగ్గురి పేరిట పట్టాలాంటి ఆరోపణలు ఉన్నాయి. వివాదాలు పరిష్కారం కాని కారణంగా పలువురికి రైతుబంధు పథకం అందడంలేదు. భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతు లు సహనం కోల్పోతున్నారు. మండల కేంద్రాల్లో పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రాలకు వస్తున్నారు. నిరసలు, ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద పదుల సంఖ్యలో రైతులు పురుగుల మందు, కిరోసిన్ వెంట తెచ్చుకోవడం, ప్లెక్సీలు పట్టుకొని ధర్నాలు చేయడం సమస్య తీవ్రతను తెలియచేసింది. కొన్నిచోట్ల రెవెన్యూ అధికారి సంతకం ఫోర్జరీ చేసి ప్రొసీడింగ్ జారీ చేసి మార్పులు, చేర్పులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు వారి భూ రికార్డుల కోసం సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకోగా అందుబాటులో లేవనే సమాధానం ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఆర్‌వోఆర్‌కు సంబంధించిన ఫైల్స్ మిస్సింగ్‌కు బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించినా ఎవరి పై చర్యలు తీసుకోలేదు. ఆన్‌లైన్ పట్టాలలో, పహాణీలలో విచ్చలవిడిగా మార్పులు చేయడం, పలువురి భూములను కబ్జాలు చేయడం, ఒకరి పేరిట ఉన్న భూమిని మరొకరు మార్చుకోవడం, రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జా చేయడం షరామామూలుగా మారింది. ప్రభుత్వం రైతుబంధు ద్వారా సాగుకు సాయం అందిస్తుండడంతో భూమి ఆక్రమణల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి జరిగిన అన్యాయాన్ని, అధికారులు చేసిన తప్పిదాలను ఎత్తిచూపుతున్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు భూ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతుబంధు పథకం పంపిణీలో నిర్లక్ష్యం

ఆదిలాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ):రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేలు చొప్పున గత రెండు సీజన్లలో అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.5 వేలకు పెంచి రైతుల ఖాతాలో జమ చేస్తోంది. రబీలో నేరుగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. అయితే క్షేత్రస్థాయిలో రైతుల వారీగా సాగు భూమి, బ్యాంకు ఖాతాలను ఎంఏఓలు పరిశీలించి, మండల వ్యవసాయాధికారికి పంపిస్తారు. ఆయన మరోసారి పరిశీలించి, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ఖజానా శాఖకు వెళ్తే వాళ్లు నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. తొలివిడతలో అయిదు ఎకరాల్లోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. విడతల వారీగా అక్కడి నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఇచ్చే డబ్బులు ఇంకా కొంత మంది రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. అయితే వీరిలో కూడా ఇంకా కొంత మంది రైతుల ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. వీరితో పాటు అయిదు ఎకరాల భూమి కంటే పైన ఉన్న రైతులకు, అటవీహక్కు పత్రాలు ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. కొత్తగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.. వారికి కూడా పెట్టుబడి సాయం అందించే అవకాశముంది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే మొత్తం రూపాయలు గతంలో తీసుకున్న పంట రుణం వడ్డీకి కట్టి, ఈ ఏడాదికి తిరిగి పంట రుణాలను రెన్యూవల్ చేసుకుంటున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించిన కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు

కరీంనగర్, ఆగష్టు 10(నేటినిజం ప్రతినిధి):గతరెండురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలప్రభావంతో అస్తవ్యస్థంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయిస్తూ ప్రజారవాణాను మెరుగుపరిచేందుకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు మానవతాహృదయంతో సేవలందిస్తూ ముందుకుసాగుతున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకే తాము పరిమితం కాదు ప్రజాసేవలోనూ ముందుంటామని సేవలందిస్తున్నారు.

గతరెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పూర్తిగా గుంతలమయంగా మారి

కరోనా నుంచి తప్పించుకున్నా ఆగని మృత్యువు

అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి

ఒంగోలు,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కుటుంబంలోని నలుగురు ఒకరి తరువాత ఒకరు కరోనా వైరస్ బారిన పడ్డారు. కరోనా కాటు నుంచి తప్పించుకునేందుకు మెరుగైన చికిత్స తీసుకునేందుకు చేసిన ప్రయత్నం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. కరోనా నుంచి కోలుకుని నేడో రేపో ఇంటికి చేరుకుంటామని ఆశించినంతలోనే ఊహించని రీతిలో ఇద్దరిని అగ్నిప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఇదీ విజయవాడ స్వర్ణ ప్యాలెస్ కోవిడ్ కేర్ సెంటర్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జయలక్ష్మి, పవన్‌కుమార్ కుటుంబంలోని విషాదగాథ. కందుకూరు పట్టణంలోని గణెళిష్‌నగర్‌లో నివాసం ఉండే దుడ్డు ప్రసాద్ ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. అలాగే ఆంజనేయ స్వామి మాల ధరించే భక్తులకు గురుస్వామిగా ప్రసిద్ధి. కందుకూరు పరిసర ప్రాంతాల్లో ఆంజనేయస్వామి మాల ధరించే భక్తులందరూ ప్రసాద్ గురుస్వామి వద్దనే మాల తీసుకుంటారు. ఆ విధంగా ప్రసాద్ చాలా సుపరిచితుడు. ఈ క్రమంలో గత నెల 30వ తేదీన కరోనా వైరస్ బారిన పడ్డాడు. మెరుగైన వైద్యం తీసుకోవాలని విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాడు. చికిత్స అనంతరం ఆయన కోలుకుని రెండు రోజుల క్రితమే ఇంటికి చేరాడు. అయితే ప్రసాద్ నుంచి వైరస్ ఆయన భార్య వెంకట జయలక్ష్మి (48), ఆయన పెద్దకుమారుడు పవన్‌కుమార్ (30), రెండో కుమారుడు మనోజ్‌కు సోకింది. కరోనా లక్షణాలు ఉండడంతో పరీక్ష చేయించుకోవడంతో పాజిటివ్‌గా తేలింది.

చెరువు మట్టితో కోటి రూపాయల ఆదాయం

మున్సిపల్ కార్యాలయ నిర్మాణం కోసం నిధుల సమీకరణ

మెదక్,ఆగస్ట్10(నేటినిజం ప్రతినిధి): నర్సాపూర్ మున్సిపాలిటీ కోసం నిధులు సమీకరణలో వినూత్నంగా వ్యవహరించారు. నర్సాపూర్ రాయరావు చెరువు మట్టి తీయడంతో కోటి రూపాయలు సమకూరాయి. దీంతో నూతన భవనం కల త్వరలోనే సాకారం కానుంది. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయాన్ని పాత పంచాయతీ భవనంలోనే నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసినప్పుడు పెచ్చులూడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మున్సిపల్ సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఓసారి కార్యాలయ ద్వారం వద్ద పైకప్పు పెచ్చులూడి పింఛన్ కోసం వచ్చిన వృద్ధురాలికి గాయాలయ్యాయి. బిల్ కలెక్టర్ గదిలో పైకప్పు తరుచుగా పెచ్చులూడుతున్నది. వర్షం పడితే గదిలోకి నీరుచేరి చెరువును తలపిస్తున్నది.మున్సిపాలిటీగా మారిన అనంతరం సిబ్బంది పెరగడంతో పాత పంచాయతీ భవనంలో స్థలం సరిపోక ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. ఇప్పటి వరకు కమిషనర్లు, అధికారులంతా ఇన్‌చార్జిలే కావడంతో ఎప్పుడో ఒకసారి వస్తుండటంతో ఎలాగోలా నెట్టుకువస్తున్నారు. పూర్తిస్థాయి అధికారులు, సిబ్బందిని నియమిస్తే ఇప్పుడున్న భవనం ఏ మాత్రం సరిపోదు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ చై?ర్మన్ మురళీధర్‌యాదవ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మంత్రి హరీ?శరావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. కొత్త భవనం కోసం నిధులు విడుదల చేయాలని ఒప్పించారు. ఆయన కృషిమేరకు రూ. 2 కోట్లతో భవన నిర్మాణానికి పూనుకున్నారు. రూ. కోటి సమకూరగా మరో కోటి రూపాయలు సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన ప్రత్యేక నిధుల నుంచి కేటాయించారు. దీంతో ఇప్పుడున్న పాత భవనాన్ని తొలగించి అదే స్థలంలో అన్ని హంగులతో నూతన భవనం నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పాత భవనం కూల్చివేత పనులు చకచక సాగుతున్నాయి.

శ్రీశైలం,సాగర్‌లకు భారీగా వరదనీరు

కర్నూలు,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశం ఇన్ ఎ÷-లో 1,89,531 క్యూసెక్కులు, అవుట్ ఎ÷-లో 42000 క్యూసెక్కులుగా ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా..ప్రస్తుతం నీటి మట్టం 858.70 అడుగులకు చేరింది. అలాగే పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 101.9210 టీఎంసీలుగా ఉంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 590.00 అడుగులకు గాను... ప్రస్తుత నీటిమట్టం 559.90 అడుగులకు చేరింది. అలాగే ఇన్ ఎ÷-లో 42,378 క్యూసెక్కులు, అవుట్ ఎ÷-లో 8,373 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 312.0405 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటి నిల్వ 232.1418 టీఎంసీలుగా నమోదు అయ్యింది.

యూజీసీ ఫైనల్ ఇయర్ పరీక్షల రద్దుపై విచారణ

కోవిడ్ నేపథ్యంలో తీసుకున్న నిర్ణయంపై వాదనలు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): యూజీసీ ఫైనల్ ఇయర్ పరీక్షల రద్దుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. యూజీసీ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడారు. డిగ్రీలు ప్రదానం చేసే పక్రియలో నియమాలను రూపొందించే హక్కు కేవలం యూజీసికి మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు యూజీసీ నియమావళిని మార్చలేవన్నారు. కోవిడ్19 నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా డిగ్రీలు ఇవ్వలేమన్నారు. అయితే ఈ కేసును సుప్రీంకోర్టు ఆగస్టు 14కు వాయిదా వేసింది. కోవిడ్ నేపథ్యంలో యూజీసీ ఫైనల్ ఇయర్ పరీక్షలను రద్దు చేయాలని ఇటీవల మహారాష్ట్ర, ఢిల్లీ ప్రభుత్వాలు నిర్ణయించాయి. అయితే ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం పట్ల స్పందించేందుకు యూజీసీకి సుప్రీం కొంత గడువును ఇచ్చింది. అశోక్ భూషన్, సుభాష్ రెడ్డి, షాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. సెప్టెంబర్ 30వ తేదీలోగా పరీక్షలు నిర్వహించాలని గతంలో యూజీసీ చెప్పింది. యూజీసీ మార్గదర్శకాలను డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ ఓవర్‌రైడ్ చేస్తుందా అని ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. విద్యార్థులు చదువుతూనే ఉండాలని, కానీ వాళ్లు పరీక్షలు రాయనంత వరకు వారికి డిగ్రీలు ఇవ్వలేరని మెహతా తెలిపారు.

గవర్నర్ కృష్ణాష్టమి సందేశం

అమరావతి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ రాష్ట్ర ప్రజలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణుడు భోదించిన సందేశాన్ని శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ గుర్తుచేస్తుందని గవర్నర్ ఒక సందేశంలో చెప్పారు. సామరస్యపూర్వక సమాజాన్ని నిర్మించడానికి శ్రీకృష్ణ జన్మాష్టమి ఒక పునాదని... సమాజంలో శాంతి, స్నేహం, సోదరభావం, ప్రజా శ్రేయస్సు నెలకొల్పేందుకు ఈ శుభదినం ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ బిశ్వభూషణ్ ఆకాంక్షించారు. మంగళవారం కృష్ణాష్టమి సందర్భంగా ఆయన సందేశం ఇచ్చారు.

వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన నిధిలో భాగంగా

ఒక లక్ష కోట్ల రూపాయల ఆర్థిక సహాయ సదుపాయాన్ని ప్రారంభించిన ప్రధాన మంత్రి

హైదరాబాద్, ఆగష్టు 10:ఒక లక్ష కోట్ల రూపాయల తో కూడిన ఏగ్రికల్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ లో భాగం గా ఆర్థిక సహాయాన్ని అందించే సదుపాయాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రారంభించారు. ఇది ఒక నూతన కేంద్రీయ రంగ పథకం.

ఈ పథకం సముదాయ వ్యావసాయిక ఆస్తుల ను నిర్మించడం లో మరియు పంట కోత అనంతరం చేపట్టేటటువంటి వ్యావసాయిక కార్యకలాపాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన లో రైతుల కు, పిఎసిఎస్ లకు, ఎఫ్ పిఒ లకు, వ్యవసాయ సంబంధి నవపారిశ్రామికుల కు సాయపడుతుంది. ఈ ఆస్తులు రైతులు వారి యొక్క ఉత్పత్తి కి మరింత అధిక విలువ ను రాబట్టుకొనే సమర్థత ను కలిగిస్తాయి. అది ఎలాగంటే వారు ఈ యొక్క ఆస్తుల అండ తో వారి ఉత్పత్తి ని నిలవ చేసుకోగలిగి, వృథా ను తగ్గించుకొని, ఇంకా ప్రోసెసింగ్ పరం గా మరియు విలువ జోడింపు ద్వారా అధిక ధరల వద్ద పంటల ను విక్రయించుకొనేందుకు వెసులుబాటు ను పొందుతారు కాబట్టి. ఈ పథకానికి నియమం ప్రకారం మంత్రిమండలి ఆమోదం తెలిపాక, కేవలం 30 రోజుల అనంతరం, ఈ రోజున, 2,280 కి పైగా రైతు సంఘాల కు 1000 కోట్ల కు పైగా డబ్బుల ను ప్రథమంగా అనుమతించడమైంది. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా నిర్వహించగా దేశం లోని వివిధ ప్రాంతాల కు చెందిన లక్షలాది రైతులు, ఎఫ్ పిఒ లు, సహకార సంఘాలు, పిఎసిఎస్ మరియు పౌరులు ఈ కార్యక్రమాని కి హాజరయ్యారు. ఇదే కార్యక్రమం లో, దాదాపు గా 8.5 కోట్ల మంది రైతుల కు పిఎమ్-కిసాన్ యొక్క ఆరో కిస్తీ లో భాగం గా 17,000 కోట్ల రూపాయల ను కూడా ప్రధాన మంత్రి విడుదల చేశారు. ఈ నగదు ప్రయోజనాన్ని వారి యొక్క ఆధార్ సంఖ్యల ను సరిచూచిన బ్యాంకు ఖాతాల లోకి నేరు గా బదలాయించడమైంది; ఒక బటన్ ను ఒత్తినంత మాత్రాననే ఈ కార్యాన్ని సంపన్నం చేయడం జరిగింది. ఈ మార్పిడి తో, 2018 వ సంవత్సరం లో డిసెంబర్ ఒకటో తేదీ నాడు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన నాటి నుండి ఇప్పటి వరకు 10 కోట్ల మంది కి పైగా రైతుల చేతుల కు 90,000 కోట్ల రూపాయల ను అందించడమైంది.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల లో సంభాషణ

ఈ పథకం ఆది నుండి లబ్ధిదారులు గా ఉన్న మధ్య ప్రదేశ్, గుజరాత్ మరియు కర్నాటక ల కు చెందిన 3 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఎసిఎస్) తో ప్రధాన మంత్రి వర్చువల్ మాధ్యమం ద్వారా సంభాషించారు.

ఈ యొక్క సంఘాల ప్రతినిధుల తో వారు రుణాన్ని ఏ రకం గా వినియోగించుకోవాలని ప్రణాళిక వేస్తున్నదీ మరియు వారి వర్తమాన కార్యకలాపాలు ఏమిటనేది అర్థం చేసుకొనే ఉద్దేశం తో ప్రధాన మంత్రి ఆకర్షక చర్చ ను చేపట్టారు. గిడ్డంగుల ను నిర్మించే, గ్రేడింగ్ ఇంకా సార్టింగ్ యూనిట్ ల ను ఏర్పాటు చేసే ప్రణాళిక లు వారి వద్ద ఉన్నాయని, ఈ ప్రణాళిక లు ఆచరణ లోకి వస్తే తద్వారా సంఘ సభ్యత్వం కల రైతులు వారి యొక్క ఉత్పత్తుల కు అధిక ధర ను సంపాదించుకోవడం లో సహాయకారి అవుతాయని సంఘాలు ప్రధాన మంత్రి కి తెలియజేశాయి.

దేశ ప్రజల ను ఉద్దేశించి ప్రసంగం

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల తో ముఖాముఖి అనంతరం, ప్రధాన మంత్రి దేశ ప్రజల ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రైతులు మరియు వ్యవసాయ రంగం ఈ యొక్క పథకం ద్వారా ఏ విధమైనటువంటి ప్రయోజనాన్ని పొందగలరో అనే విషయం పట్ల తనకు గల విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ పథకం రైతుల కు మరియు వ్యవసాయ రంగానికి ఆర్థికపరమైనటువంటి ఉత్తేజాన్ని సమకూర్చగలదని, అలాగే ప్రపంచ వేదిక పైన పోటీ కి నిలచేందుకు భారతదేశం యొక్క సామర్థ్యాన్ని పెంపు చేస్తుందని ఆయన అన్నారు. గోదాముల నిర్మాణం, చలవ వసతులు, ఇంకా ఫూడ్ ప్రోసెసింగ్ ల వంటి పంటకోతల అనంతర వ్యవసాయ ఉత్పత్తి నిర్వహణ సంబంధి సాధనాల లో పెట్టుబడి పెట్టడం కోసం మరియు సేంద్రియ ఆహార పదార్థాలు, ఇంకా దృఢీకరించిన ఆహార పదార్థాల వంటి రంగాల లో ప్రపంచ స్థాయి ఉపస్థితి ని ఆవిష్కరించుకోవడం కోసం భారతదేశం లో ఒక భారీ అవకాశం ఉన్నదని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. ఈ పథకం వ్యవసాయ రంగం లో స్టార్ట్ అప్ స్ కు ప్రయోజనాల ను అందుకొనేందుకు వాటి యొక్క కార్యకలాపాల ను విస్తరించుకొనేందుకు ఒక మంచి అవకాశాన్ని ప్రసాదిస్తుందని, తద్వారా దేశం లోని ప్రతి ఒక్క మూల లోని రైతుల ను చేరగలిగే ఒక ఇకోసిస్టమ్ వెలసే ఆస్కారం ఉందని కూడా ఆయన అన్నారు.

పిఎమ్-కిసాన్ పథకం అమలు యొక్క వేగం పట్ల ప్రధాన మంత్రి తన సంతృప్తి ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం యొక్క కొలత ఎంత పెద్దదీ అంటే ఈ రోజు న విడుదల అయిన నిధులు అనేక దేశాల యావత్తు జనాభా అంతటి ని ఒక చోటు లో చేర్చినపుడు ఏర్పడే దాని కంటే కూడా అధిక సంఖ్య లో గల ప్రజల కు ఈ యొక్క నిధులు చేరుకొన్నాయి అని కూడా ఆయన అన్నారు. నమోదు మొదలుకొని పంపకాల వరకు గల యావత్తు ప్రక్రియ ద్వారా రైతుల కు సాయపడడం లో మరియు పథకం యొక్క అమలు లో ఒక ముఖ్య పాత్ర ను పోషిస్తున్నందుకు గాను రాష్ట్రాల ను కూడా ఆయన అభినందించారు.వ్యవసాయం మరియు రైతుల సంక్షేమం శాఖ కేంద్ర మంత్రి శ్రీ నరేంద్ర సింహ్ తోమర్ కూడా ఈ సందర్భం లో హాజరయ్యారు.

వ్యవసాయ సంబంధి మౌలిక సదుపాయాల నిధి

పంటకోత ల అనంతర నిర్వహణ సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన కు మరియు సముదాయ వ్యావసాయిక ఆస్తుల కల్పన కు ఉద్దేశించిన ఆచరణీయ పరియోజనల లో పెట్టుబడి పెట్టేందుకు దీర్ఘకాలికమైన ఆర్థిక సహాయ పెట్టుబడి సౌకర్యాన్ని అందించే ఒక మాధ్యమం వ్యవసాయ సంబంధి మౌలిక సదుపాయాల నిధి. దీనిలో పరపతి పూచీ, ఇంకా వడ్డీ లో ప్రభుత్వ ఆర్థిక సహాయం కలసి ఉంటాయి. ఈ పథకం యొక్క కాలపరిమితి 2020 వ ఆర్థిక సంవత్సరం నుండి 2029 వ ఆర్థిక సంవత్సరం వరకు (అంటే 10 సంవత్సరాల పాటు) ఉంటుంది.

ఈ పథకం లో భాగం గా, బ్యాంకు లు మరియు ఆర్థిక సహాయ సంస్థ లు ఒక లక్ష కోట్ల రూపాయల ను రుణాలు గా సమకూర్చుతాయి. ఈ రుణాల కు ప్రతి ఒక్క సంవత్సరాని కి 3 శాతం ఇంటరెస్ట్ సబ్ వెన్షన్ మరియు 2 కోట్ల రూపాయల వరకు ఉండే రుణాల కు సిజిటిఎమ్ఎస్ఇ పథకం లో భాగం గా పరపతి పూచీ లభిస్తుంది. లబ్ధిదారుల లో రైతు లు, వ్యవసాయ సంబంధి నవ పారిశ్రామికుల తో పాటు, పిఎసిఎస్ లు, మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ లు, ఎఫ్ పిఒ లు, ఎస్ హెచ్ జి లు, జాయింట్ లయబిలిటి గ్రూప్స్ (జెఎల్ జి), బహుళ ప్రయోజనాత్మక సహకార సంఘాలు, , స్టార్ట్ అప్ స్, ఇంకా సెంట్రల్/ స్టేట్ ఏజెన్సి లేదా స్థానిక సంస్థ ప్రాయోజితం చేసిన పబ్లిక్-ప్రైవేట్ పార్ట్ నర్ శిప్ ప్రాజెక్టు లు కూడా ఉంటాయి.

పిఎమ్-కిసాన్

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పిఎమ్-కిసాన్) పథకాన్ని 2018వ సంవత్సరం లో డిసెంబర్ ఒకటో తేదీ నాడు ప్రవేశపెట్టడమైంది. కమతాల ను కలిగివున్న రైతు లు అందరి కి (కొన్ని మినహాయింపు ప్రమాణాల కు లోబడి) వారు వారి యొక్క వ్యావసాయిక అవసరాల ను తీర్చుకోగలిగి మరి వారి యొక్క కుటుంబాల కు దన్ను గా నిలచే వీలు ను కల్పించడం కోసం నగదు ప్రయోజనం రూపేణా ఆదాయ పరమైనటువంటి మద్దతు ను సమకూర్చడానికి ఈ పథకాన్ని లక్షించారు. ఈ పథకం లో భాగం గా, అర్హులైన లబ్ధిదారు రైతుల కు ప్రతి ఒక్క సంవత్సరం లో 6000 రూపాయల వంతున ఆర్థిక సహాయ ప్రయోజనాన్ని మూడు సమాన కిస్తీల లో అందించడం జరుగుతున్నది.

వ్యవసాయ రంగానికి ఒక నవోదయం

ఈ చర్య లు ప్రధాన మంత్రి మార్గదర్శకత్వం లో భారత ప్రభుత్వం తీసుకొన్న సంస్కరణ ల యొక్క క్రమం లో తాజా వి. ఈ చర్య లు భారతదేశం లో వ్యవసాయ రంగానికి ఒక నూతనమైన తొలిసంజ ను ప్రకటించగలవు. ఈ చర్య లు భారతదేశం లో రైతుల సతత జీవనోపాధి కి మరియు రైతు ల సంక్షేమానికి పూచీ పడాలన్న ఆశయ సాధన పట్ల ప్రభుత్వం యొక్క నిబద్ధత ను నిరూపిస్తున్నాయి.

గ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలు

కార్మిక ఉపాధి కల్పన శాఖ కార్యాచరణ

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలను గ్రామీణ యువత అందిపుచ్చుకునేలా కార్మిక ఉపాధి కల్పన శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలు కంపెనీలతో సంప్రదించి ఉద్యోగ ఖాళీల భర్తీపై చర్చలు జరిపింది. ఇందులో భాగంగా డీట్ వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టిన అధికారులు.. తాజాగా నేరుగా ఉద్యోగాల భర్తీకి సిద్ధమవుతున్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హతలేమిటి...అభ్యర్థుల నియామకం ఎలా చేపట్టాలనే దానిపై కంపెనీల వారీగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇదివరకు ఎంఎ÷-లాయిమెంట్ ఎక్ఛేంజ్ లో ఉద్యోగ మేళాలు నిర్వహించినప్పటికీ ఒకట్రెండు కంపెనీలు మాత్రమే పాల్గొనేవి. ఇప్పుడలా కాకుండా కంపెనీల వారీగా ఉన్న ఉద్యోగాలను కేటగిరీలుగా విభజించి ఆమేరకు ఒక్కో కేటగిరీని భర్తీ చేస్తారు. అభ్యర్థుల ఆసక్తిని బట్టి కంపెనీలను ఎంపిక చేసుకోవచ్చు. కంపెనీల వారీగా ఖాళీల వివరాలను సేకరించిన తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో పొందు పరుస్తారు. ఆన్‌లైన్ పద్ధతిలోనే జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ ద్వారా జాబ్ మేళా నిర్వహించి భర్తీ చేస్తారు. కోవిడ్-19 తీవ్రత తగ్గిన తర్వాత అప్పటి పరిస్థితులకు తగినట్లు జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు కార్మిక ఉపాధి కల్పన శాఖ ఉన్నతాధికారి అన్నారు. ఇంతవరకు ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో ఉపాది కల్పించేందుకు తెలంగాణా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రైవేటు రంగంలో వీటిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందకు జిల్లా ఎంప్లాయ్ మెంట్ ఎక్ఛేంజ్ లు కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ దృష్టి సారించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు ఈ మేరకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఓ సంస్థ సహకారంతో డీట్ అనే వెబ్‌సైట్ ద్వారా ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం చేస్తున్న ఆ శాఖ..త్వరలో కార్పొరేట్ కంపెనీ యాజమాన్యాలతో సమన్వయం కానుంది. ఆయా కంపెనీలో ఉన్న ఉద్యోగ ఖాళీలకు తగిన అర్హులను గుర్తించి భర్తీ చేయనుంది.

మూడురాజధానుల ఆటలో మేధావుల మౌనం

ప్రజల ఆందోళనలను పట్టించుకోని అధికారగణం

అమరావతి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): మూడురాజధానులకు సిఎం జగన్ శంకుస్థాపన చేసేందుకు సిద్ధం అవుతున్నారు. కోర్టులు, విపక్షాలు, ప్రజల ఆకాంక్షలతో సంబంధం లేకుండా దూకుడుగా పోతున్నారు. దీంతో త్వరగా దీనిని కార్యాచరణలోకి తీసుకుని వచ్చే లక్ష్యంతో ఉన్నారు. ఇందుకు అనుగుణంగా అభివృద్ధి వికేంద్రీకరణ అన్న కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారు. మంచి ఏమిటో, చెడు ఏమిటో అన్న ప్రశ్నలకు తావీయకుండా సాగుతున్నారు. కరోనాతో రాష్ట్రంలో అల్లకల్లోలంగా మారింది. ప్రజలంతా వ్యాధితో భయంలో ఉన్నారు. ఎక్కడ వైరస్ తమకు అంటుతుందో అన్న బెంగలో ఉన్నారు. ఇదే అదనుగా గవర్నర్‌తో చట్టబద్ధంగా మూడురాజధానులకు ఆదేశాలు ఇప్పించుకున్నారు. అయితే హైకోర్టు స్టే ఇచ్చినా అది తాత్కాలికమే కావడంతో చాపకింద నీరులా తమ ప్రయోజనాల కోసం పనులు చకచకా సాగిస్తున్నారు.

ప్రజల అమాయకత్వాన్ని, భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని అభివృద్ధి వికేంద్రీకరణ పేరిట మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తెచ్చారు. ప్రజలకు వివిధ పథకాల పేరుతో తాయిలాలు పంచడంతో వారంతా అందులో బిజీగా ఉండిపోయారు. దీనితో ఒక్క రాజధానికి కూడా దిక్కులేని రాష్ట్రం ఇప్పుడు మూడు రాజధానుల భ్రమలో మునిగిపోయింది. ప్రజలు కూడా ఇందుకు అనుగుణంగా విడిపోయారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా, వ్యతిరేకంగా కొందరు ప్రకటనలు చేస్తున్నారు. రాజధాని రాష్ట్రానికి మధ్యలో ఉండాలని, నీరూ భూమి పుష్కలంగా అందుబాటులో ఉండాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ప్రకటించారు. ఆనాడు అమరావతి ని అంగీకరించారు. కానీ అధికారంలోకి రాగానే స్వరం మార్చారు. ఇచ్చిన సుదీర్ఘ నిర్వచనాన్ని జనంతో పాటు ఆయన కూడా మర్చిపోయారు. ఒక్క రాజధానికే దిక్కులేదు మూడు రాజధానులా? అని బుద్ధి జీవులు వేస్తున్న ప్రశ్న మందబలం ముందు నిలవలేకపోతున్నది. జగన్ రెడ్డిని గతంలో తీవ్రంగా విమర్శించిన వారు ఇప్పుడు మంత్రులుగా వెలుగొందుతున్నారు. జగన్ తీసుకున్న నిర్ణయం అద్భుతం, అమోఘం అని చిడతలు కొడుతున్నారు. నిజమైన అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఏమిటో, ఎలా ఉండాలో తెలుసుకోలేని స్థితిలో ప్రజలు ఉన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమ ఎజెండా ప్రకారం చేస్తున్న ప్రకటనలు ప్రజలను మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. ఏ రాజకీయ పార్టీ కూడా అధికారంలో శాశ్వతంగా ఉండకపోయినా ఉన్నన్నాళ్లు తమ అజెండాను అమలు చేయాలన్న పట్టుదలకు పోతున్నారు. విద్యావంతులు,మేధావులు మౌనాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో అధికార వైకాపా ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తమ సొంత ఎజెండాను అమలుచేస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థను కొవిడ్ చిన్నాభిన్నం చేయడమే కాకుండా ప్రజల జీవితాలను ఆగం చేస్తోంది. ఈ దశ పాలకులకు కలిసి వస్తోంది. ప్రజలంతా ఇప్పుడు కోవిడ్ బారిన పడకుండా ప్రాణాలు దక్కించుకునే పనిలో పడ్డారు. ఇదే అదనుగా అధికార పార్టీ నేతలు మూడు రాజధానుల కోసం వేగంగా పావులు కదుపుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో తమకు ఏదో ఒరిగిపడుతుందన్న ఆశతో కొందరున్నారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులది అరణ్య రోదనగా మిగిలిపోతోంది. కరోనా వైరస్ బారిన పడినవారు వైద్యంకోసం చేస్తున్న ఆక్రందనలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ తరుణంలో జగన్ రాజకీయంగా బలపడటానికి ఏమి చేయాలో అదే చేస్తున్నారు. ఈ పోకడలను నిలువరించ వలసిన మేధావులు మౌనాన్ని ఆశ్రయించడంతో అవన్నీ అప్రధానమైనవిగా మారాయి.

ప్రభుత్వ ఆర్జనలో కీలక మలుపుగా మారనున్న ప్రభుత్వ ఇ-మార్కెటింగ్(జిఇఎం)లో ఎక్కువ మంది కొనుగోలు మరియు అమ్మకందారులను పాల్గొనవలసిందిగా

ఆహ్వానించిన శ్రీ పీయూష్ గోయల్; ఈ ప్రభుత్వ ఇ-మార్కెటింగ్లో త్వరలో భాగస్వామి కానున్న భారతీయ రైల్వే

హైదరాబాద్, ఆగష్టు 10:ప్రభుత్వ ఇ-మార్కెటింగ్ ఏర్పాటు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఇ-మార్కెటింగ్(జిఇఎం) మరియు భారత పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) వారి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల సమావేశంలో కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మరియు రైల్వే మంత్రి వర్యులు శ్రీ పీయూష్ గోయల్ గారు ఈ రోజు ఆన్లైనో ప్రభుత్వ సార్వజనీన సంగ్రహణ సమావేశాల నాలుగవ సంకలనా(ఎన్పిపిసి)న్ని ప్రారంభించారు. ఎన్పిపిసి యొక్క ఇతివృత్తం "సామర్థ్యం, పారదర్శకత మరియు కలయిక-దిశగా - సాంకేతికతతో కూడిన ప్రభుత్వ సేకరణ"

ప్రభుత్వ మార్కెటింగ్ సేకరణలో కీలకంగా మారిన జిఇఎం పద్ధతిలో ఎక్కువ మంది కొనుగోలుదారులు మరియు అమ్మకందారులు పాల్గొనాలని కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. ద్రవ్య రక్షణతో దేశాభివృద్ధిలో జిఇఎం కీలక పాత్ర పోషిస్తున్నది. అవసరమైన సమాచారమంతా ఒక చోట పారదర్శకతతో త్వరిత సామర్థ్యంతో సులభంగా లభ్యమవడమే కాక ఎవరైనా ఈ పద్ధతిలో మోసపుచ్చడానికి ప్రయత్నించిన వారిని వెంటనే గుర్తించగల సాంకేతికత కలదని శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. అదే విధంగా అమ్మకందారులెవరైనా నాణ్యత లేని వస్తువులను ఎక్కువ ధరకు అమ్మజూపినట్లైతే వారిని జిఇఎం వ్యవహార నిషిద్ధుల జాబితాలో పెట్టడమే కాకుండా మొత్తం ప్రభుత్వ వ్యవస్థల్లో కూడా నిషేధిస్తామని ఆయన హెచ్చరించారు.భారత పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) వారు జిఇఎంను దేశం నలుమూలలా విస్తరించడానికి చేసిన ప్రతిపాదనను ఆయన ఆహ్వానించారు. ఎక్కువ మంది అమ్మకందారులు మరియు కొనుగోలుదారులు ఇందులో భాగస్వాములు కావడం వలన నాణ్యమైన వస్తువులు తక్కువ ధరకు లభిస్తాయని ఆయన అన్నారు.

ఎన్నో ఏళ్ళ నుండి సౌకర్యాలు లేని వర్గాల వారికి తగిన సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం తన వంతు తీవ్ర కృషి చేస్తోందని ప్రభుత్వ సంగ్రహణ భారీగా మ

కొవిడ్ కారణంగా రవాణా సేవల్లో మార్పులు

డ్రైవింగ్ సిమ్యులేటర్‌ను ప్రారంభించిన పువ్వాడ

ఖమ్మం,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ప్రస్తుత కొవిడ్ తరుణంలో రవాణా సేవల్లో అనేక మార్పులు, చేర్పుల అనంతరం కొన్ని కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వినియోగదారుడు కార్యాలయానికి రాకుండానే అనేక సేవలు ఇప్పటికే ఆన్ లైన్ చేశామన్నారు. ఇటీవలే జులై 24వ తేదీన మరో 5 సేవలు ఆన్ లైన్ పొందుపరిచామని, ఇది వినియోగదారుడికి ఎంతో సౌకర్యవంతంగా మారిందన్నారు. ఖమ్మం రవాణా కార్యాలయంలో మంత్రి పువ్వాడ చొరవతో డ్రైవింగ్ సిమ్యులేటర్ ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయా సిమ్యులేటర్‌ను పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖలో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్ రవాణా కార్యాలయంలో ఉండే ప్రతి సౌకర్యాన్ని విస్తరించాలని తలచి సిమ్యులేటర్ ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్లు, భారీ వాహనాలు నేర్చుకోదలచిన వారు మొదట సిమ్యులేటర్స్‌పైన తప్పనిసరిగా శిక్షణ పొందాల్సిందేనని అన్నారు. రోడ్డుపై వాహనాన్ని నడిపేందుకు ముందు సిమ్యులేటర్ ద్వారా డ్రైవింగ్ మెళకువలను తెలుసుకోడం తప్పనిసరి అని, ఇందుకోసం రవాణాశాఖ స్వయంగా సిమ్యులేటర్ శిక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. లెర్నింగ్ లైసెన్సు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను సిమ్యులేటర్ శిక్షణకు ప్రోత్సహించేందుకు ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిమ్యులేటర్ మాదిరిగానే తొలిసారిగా ఖమ్మంలో ఈ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి డ్రైవింగ్ స్కూల్లో సిమ్యులేటర్ శిక్షణ తప్పనిసరి చేయనుమని పేర్కొన్నారు. తద్వారా ప్రాథమిక దశలోనే వాహనదారులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధన లపైన అవగాహన ఏర్పడుతుందన్నారు. రోడ్డుపైన వాహనాన్ని నడపడం కంటే ముందే డ్రైవింగ్ లో మెళకువలను నేర్పించడం వల్ల రెట్టింపు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఖమ్మం రవాణా కార్యాలయంలో డ్రైవింగ్ సిమ్యులేటర్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

మాస్కు ధరించకుంటే వేయి ఫైన్

నేటినుంచే గుజరాత్‌లో అమలు

అహ్మదాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు మాస్కు ధరించకపోతే రూ.200గా ఉన్న ఫైన్‌ను ఇక నుంచి ఏకంగా రూ.1000కి పెంచింది. పెంచిన ఫైన్ ఆగస్టు 11 నుంచి అమల్లోకి వస్తుందని గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ వెల్లడించారు. గుజరాత్‌లో కరోనా మహమ్మారి విజృంభణ కొనసాగుతున్నది. అయినా కొవిడ్ నిబంధనలు పాటించడంలో పలువురు గుజరాతీలు అశ్రద్ధ చేస్తున్నారు. తప్పనిసరిగా మాస్కు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని అధికారులు చెబుతున్నా చాలా మంది పట్టించుకోవడంలేదు. దీంతో కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇకపోతే గుజరాత్‌లో ప్రతిరోజు వెయ్యికిపైగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఆదివారం కూడా 1,078 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆ రాష్ట్రంలో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య డెబ్బై వేల మార్కును దాటి 71,064కు చేరింది. ఇక గుజరాత్‌లో కరోనా మరణాలు కూడా క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. ఆదివారం కొత్తగా 25 మంది కరోనా బాధితులు ప్రాణాలు కోల్పోవడంతో మొత్తం కరోనా మరణాల సంఖ్య 2,654కు చేరింది.

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్న కారు

కానిస్టేబుల్ దుర్మరణం

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): మద్యం మత్తులో ఓ యువకుడు కారును అతివేగంగా నడిపి పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టడంతో కానిస్టేబుల్ మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఢిల్లీ యూనివర్సిటీ ఖల్సా కళాశాల సమీపంలో సోమవారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మోడల్ సిటీ ప్రాంతానికి చెందిన తుషార్ అనే యువకుడు పూటుగా మద్యం సేవించి కారును వేగంగా నడుపుతూ ఢిల్లీ యూనివర్సిటీ ఖల్సా కళాశాల సమీపం వద్ద పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టాడు.

కారు ఢీకొన్న వేగానికి పెట్రోలింగ్ వాహనం 10 అడుగుల మేర గాలిలో ఎగిరిపడడంతో వాహనంలోని కానిస్టేబుల్ వజీర్ సింగ్ (50) అందులో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్వల్పంగా గాయపడిన డ్రైవర్ అమిత్‌ను స్థానికులు బయటకు తీసినట్లు ఢిల్లీ ఉత్తర మండల డీసీపీ మోనికా భరద్వాజ్ తెలిపారు. వజీర్ సింగ్‌ను స్థానికంగా సివిల్ లైన్ ట్రామా కేంద్రానికి తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితుడు తుషార్‌పై ఐపీసీ 279, 337,304 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్

వేములవాడ, ఆగష్టు 10 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కులవృత్తులకు చేయూతనివ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

సోమవారం ఆయన బోయినపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేర్) లో రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి శ్రీ గంగుల కమలాకర్, జెడ్పీ చైర్మన్ అరుణ, చొప్పదండి శాసనసభ్యులు సుంకే రవిశంకర్, అదనపు కలెక్టర్ ఆర్.అంజయ్య తో కలిసి 28 లక్షల 50 వేల ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 80 కోట్ల చేప పిల్లలను డ్యాంలలో విడుదల చేసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతుందని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు కూడా చేపలు పట్టుకోవడానికి సుమారు 2 వేల మంది మత్స్య కారులకు లైసెన్సులు జారీ చేశామని తెలిపారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి అన్ని వర్గాల ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఈ చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీని ద్వారా గడిచిన 5 సంవత్సరాలలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించుకున్నామని అన్నారు.రానున్న రోజుల్లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేసుకుని మన లోకల్ చేపలను లోకల్ మార్కెట్ లలో కాకుండా హైదరాబాద్ లేదా అంతర్జాతీయ మార్కెట్ లకు కూడా ఎగుమతి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించేలా చర్యలు చేపడుతామని అన్నారు.

కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలనే గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల ప్రజల సంతోషం కోసమే ప్రభుత్వం 24 గంటల విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, శాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు మొదలైన వివిధ కార్యక్రమాలను చేపడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో నియంత్రిత వ్యవసాయం అమలుతో రైతాంగ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కుల వృత్తులకు కూడా ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

ముఖ్యంగా ప్రతీ చెరువులో ఉచిత చేప పిల్లలను వదిలేటప్పుడు చేప పిల్లల నాణ్యత, పరిమాణంలో, కౌంటింగ్ లో లోపాలు ఏమీ ఉండవని అన్నారు. అలాగే చేపలను వదిలేటప్పుడు తప్పనిసరిగా వీడియోగ్రఫీ తీయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

-రాజరాజేశ్వర జలాశయాన్ని చూస్తే సంతోషంగా ఉంది : మంత్రి

కాళేశ్వరం ప్రాజెక్టు మూలాన జలకళ సంతరించుకున్న శ్రీ రాజరాజేశ్వర జలాశయాన్ని చూస్తే చాలా సంతోషంగా ఉందని మంత్రి శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. గడిచిన 60 సంవత్సరాలలో ఇలాంటి నేలలో నీళ్ళు చూసిన దాఖలాలు లేవని, కేవలం ఈ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, దీనిద్వారా ఒకప్పుడు మెట్ట ప్రాంతంగా ఉన్నటువంటి ఈ ప్రాంతాన్ని ఈరోజు పూర్తి సామర్థ్యంతో నిండి ఉన్న నీటిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఎన్ అరుణ, స్థానిక ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, జిల్లా అదనపు కలెక్టర్ ఆర్ అంజయ్య, జిల్లా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఖదీర్ అహ్మద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

-కులవృత్తులకు చేయూత నివ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేది ప్రభుత్వ సంకల్పం.
-మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసమే ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం.
-ఈ సంవత్సరం రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో 80 కోట్ల చేప పిల్లలు, 5 కోట్ల రొయ్య పిల్లల విడుదల.
-మంత్రి శ్రీ గంగుల కమలాకర్ తో కలిసి శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేర్) లో 5 వేల 700 హెక్టార్లలో 28 లక్షల 50 వేల ఉచిత చేప పిల్లల విడుదల

ఐఐటి విద్యార్థినికి కెటిఆర్ ఆర్థిక సాయం

వరంగల్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని హసన్‌పర్తికి చెందిన మేకల అంజలికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు సోమవారం ఆర్థిక సాయం అందించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఐఐటీలో చదువుతున్న అంజలి మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి ప్రవేశించింది. దీంతో ఆమెకు ఫీజులు, లాప్‌టాప్ ఖరీదు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.1,50,000 రూపాయలను అందించారు. కాగా అంజలి గతేడాది హసన్‌పర్తిలోని గురుకులంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకొని ఐఐటీలో మంచి ర్యాంకు సాధించింది. అయితే తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమేనని, పై చదువుల నిమిత్తం తనకు సహాయం అందించాల్సిందిగా మంత్రి కేటీఆర్‌కు ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అప్పుడు దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్ గత సంవత్సరం సైతం ఫీజుల నిమిత్తం అవసరమైన ఆర్థిక సాయం అందించారు. అంజలి తండ్రి రమేష్ ఆటో డ్రైవర్ కావడంతో ఐఐటీ విద్య పూర్తయ్యే వరకు అవసరమైన నిధులను వ్యక్తిగతంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు అంజలి రెండో సంవత్సరానికి సంబంధించిన ఖర్చులను నేడు ప్రగతి భవన్‌లో అంజలికి అందజేశారు. కేటీఆర్ చేసిన సాయానికి అంజలి కుటుంబం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

కోవిడ్ ఆస్పత్రిలో అగ్నిప్రమాద ఘటన

అన్ని ఆస్పత్రులకు హెచ్చరిక చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): అహ్మదాబాద్‌లో ఒక ఆస్పత్రిలో అగ్ని ప్రమాద సంఘటన.. తాజాగా విజయవాడలో కరోనా బాధితులు ఐసోలేషన్ చికిత్స పొందుతున్న హోటల్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ అలర్ట్ అయింది. ఆయా హోటళ్లతో పాటు అన్ని కరోనా ఆస్పత్రుల్లోనూ అగ్నిప్రమాద నివారణ నిబంధనలపై తక్షణమే తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. తాజా అగ్ని ప్రమాదాల సంఘటన నేపథ్యంలో అన్ని ఆస్పత్రులు/ కోవిడ్ కేర్ సెంటర్లు అగ్ని ప్రమాద నివారణకు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించినట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆయన అన్ని ఆస్పత్రులు, కోవిడ్ కేర్ సెంటర్ల (హోటళ్లు)కు ఆదేశాలు ఇస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా హోటళ్లు ఏ మేరకు అగ్ని ప్రమాదాల నివారణకు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారన్న దానిపైనా వైద్య, ఆరోగ్య శాఖ తనిఖీలు చేయాలని యోచిస్తుంది. రాష్ట్రంలో కోవిడ్ కేంద్రాలుగా 36 హోటళ్లు అనుమతి పొందినా, మరో 50,60 హోటళ్లలో ఇష్టానుసారంగా కరోనా రోగులను ఐసోలేషన్లో ఉంచుతున్నట్లు వైద్యవర్గాలు గుర్తించినట్లు తెలిసింది. ఇందులో కొన్ని కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదని బాధితులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోవిడ్ లక్షణాలతో బాధపడుతున్న పలువురు రోగులు ఇంట్లో అందరితో కలసి ఉండకుండా హోటల్ గదిలో సెల్ఫ్ ఐసోలేషన్ అయ్యేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో పలు త్రీస్టార్, ఫైవ్‌స్టార్ హోటళ్లు క్వారంటైన్ కేంద్రాలుగా మారుతున్నాయి.

ఆయా హోటళ్లలో సుమారు మూడువేల మంది వరకు కోవిడ్ రోగులు ఉన్నట్లు సమాచారం.

ఆరోగ్యశాఖ సూచనలు

ఆస్పత్రులు, హోటళ్లలో అగ్నిప్రమాద నివారణ కోసం జనరేటర్ అందుబాటులో ఉంచాలి. అగ్నిప్రమాదం జరిగితే విద్యుత్ సౌకర్యాన్ని నిలిపివేసి జనరేటర్‌ను ఆన్ చేస్తారు. హోటల్ లేదా ఆస్పత్రి బిల్డింగ్‌పై పెద్ద నీటి తొట్టిని ఏర్పాటు చేయాలి. ప్రతీ ఫ్లోర్‌కు నీటిని అందించేందుకు వీలుగా పెద్ద పైపును ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాదంలో చేపట్టాల్సిన చర్యలపై అప్పుడప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలి.ఆయా భవనాలకు రెండు వైపులా మెట్లుండాలి. అగ్ని ప్రమాదం జరిగితే రోగులు, ఇతరులు బయటకు రావడానికి వీలుగా ఉండాలి.

అవినీతిలో కూరుకుపోయిన తెలంగాణ సర్కార్

తెలంగాణలో బిజెపి కార్యాయాలకు వర్చువల్ శంకుస్థాపన

కరోనాపై కెసిఆర్‌ది కుంభకర్ణ నిద్ర అన్న నడ్డా

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శలు గుప్పించారు. తెలంగాణ జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలకు సోమవారం భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ వేదికగా ఢిల్లీ నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45వేల కోట్ల రూపాయలకు పూర్తికావాల్సిన కాళేశ్వరం ప్రాజక్టును దోచుకోవటం కోసమే 85వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. గడిచిన ఆరేళ్ళుగా తెలంగాణ ప్రజలకు చేసిందేంటో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే లక్ష ఉద్యోగాలిస్తానన్న కేసీఆర్ నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలిచ్చారని నిలదీశారు. ఏడు లక్షల ఇళ్ళు నిర్మిస్తానని 50వేల ఇళ్ళు కూడా కట్టలేదని జేపీ నడ్డా దుయ్యబట్టారు. 'కరోనాను కట్టడి చేయకుండా సీఎం కేసీఆర్ కుంభకర్ణుడి నిద్రపోతున్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా తెలంగాణ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటంలేదు. కరోనా టెస్టులు చేయటంలో తెలంగాణ వెనుకబడిపోయింది. లోక్ సభ ఎన్నికల మాదిరిగానే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయకపోవటం వల్ల 98 లక్షల మంది బీమా సౌకర్యాన్ని కోల్పోయారు. కోవిడ్‌ను ఎదుర్కొనే క్రమంలో కేంద్రానికి దేశ ప్రజలు సహకరించాలి. సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుని కేంద్రం పనిచేస్తోంది. కార్యకర్తల కోసం ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయం ఉండాలనేది ప్రధాని మోదీ ఆలోచన. ప్రధాని మోదీ ఆలోచన మేరకు పార్టీ కార్యాలయాల నిర్మాణం. కోవిడ్‌ను ఎదుర్కోవటంలో ప్రధాని మోదీ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు.' అని జేపీ నడ్డా అన్నారు.

మాజీమంత్రి పెన్మత్స మృతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతాపం

విజయనగరం,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విశాఖ అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక నాయకుడిగా ఆయన గుర్తింపును సొంతం చేసుకున్నారు. 1989-94 లో మంత్రిగా, 1958లో నమితి ప్రెసిడెంట్ గా బాధ్యతలు నిర్వహించారు. 1968లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఆయన గజపతినగరం, సతివాడ శాసనసభ స్థానాల నుంచి వరుసగా ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగి రాజకీయ కురువృద్ధుడిగా గుర్తింపు పొందారు. సాంబశివరాజు రెండు సార్లు మంత్రిగా, ఎనిమిది సార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. మంత్రి బొత్స వంటి హేమాహేమీలకు రాజకీయ గురువుగా సాంబశివరాజు గుర్తింపు పొందారు. రాజకీయ కురువృద్ధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు. దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో ఉంటూ, మచ్చలేని నాయకుడిగా, రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు అర్థం చెప్పిన నాయకుడు సాంబశివరాజు అని సీఎం కొనియాడారు. ఆయన మరణం విజయనగరం జిల్లాతో పాటు, రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు. పెనుమత్స సాంబశివరాజు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజీ మంత్రి పెనుమత్స సాంబశివరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు అని ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారని, విలువలతో నిజాయితీ గా రాజకీయాలు చేశారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి పెన్మత్స సాంబశివరాజు మృతిపై మంత్రి అవంతి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఉత్తరాంధ్ర రాజకీయాల్లోనే కాదు అభివృద్ధిలో కూడా సాంబశివరాజు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. పెనుమత్స సాంబశివరాజు మృతి పట్ల డిప్యూటీ సీఎం పుష్పశ్రీ వాణి సంతాపం తెలిపారు. విజయనగరం రాజకీయాల్లో ఆయన అరుదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్, జిల్లాకి ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని పుష్ప శ్రీవాణి తెలిపారు.

సచివాలయ వ్యవస్థలో మరో కీలక అడుగు

పీఎంయూ కాల్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్

అమరావతి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): గ్రామ, వార్డు సచివాలయాల్లో మరో కీలక అడుగు పడింది. గ్రామ, వార్డు సచివాలయాల కోసం ప్రత్యేకంగా పీఎంయూ కాల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. యంత్రాంగంలో ఎక్కడ దరఖాస్తు ఆగినా పీఎంయూ అప్రమత్తం చేయనుంది.

గ్రామ, వార్డు సచివాలయాలపై క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. సామాజిక తనిఖీ మార్గదర్శకాలను జగన్ విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల కోసం ప్రత్యేకంగా పీఎంయూ కాల్ సెంటర్‌ను జగన్ ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ నీలం సాహ్ని, గ్రామ, వార్డు సచివాలయాల ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిర్దేశించిన సమయంలోగా పరిష్కారం అయ్యేలా పీఎంయూను ఏర్పాటు చేశారు. మొదటగా నాలుగు సర్వీసులు, అక్టోబర్ నుంచి 543కి పైగా సేవలను అమలు చేయనున్నారు. మారుమూల ప్రాంతాల్లో సచివాలయాలకు నెట్ సదుపాయాన్ని వైఎస్ జగన్ ప్రారంభించారు. ఇంటర్నెట్ లేని 512 సచివాలయాలను అనుసంధానం చేయనున్నారు.ఇందులో 213 సచివాలయాల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు. మిగిలిన సచివాలయాలను వచ్చే 2 నెలల్లో అనుసంధానిస్తా మని అధికారులు తెలిపారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాలపై సీఎం జగన్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. వార్డు సచివాలయాల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేసి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు, వాటి మార్గదర్శకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అర్బన్ హెల్త్ క్లినిక్స్‌పై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గ్రామ,వార్డు సచివాలయాల్లో ఖాళీలకు సెప్టెంబరు లోగా పరీక్షల ప్రక్రియ ముగియాలి. ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. సచివాలయాల్లోని ఉద్యోగులకు, వాలంటీర్లకు ప్రభుత్వ పథకాల మీద పూర్తి అవగాహన ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు 90 రోజుల సమయం పెట్టుకున్నా.. ఒక నెలలో వచ్చిన దరఖాస్తులను అదే నెలలో పరిష్కరించుకుని యాక్షన్ ప్లాన్‌కు సన్నద్ధం కావాలని సీఎం సూచించారు. నిర్ణీత సమయంలోగా దరఖాస్తు పరిష్కారం కాకపోతే కారణం ఏంటనేది ముఖ్యమంత్రి కార్యాలయానికి రావాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్ల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం అంగీకరించదని అధికారులు వెల్లడించారు. ల్యాండ్ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు ఒక షెడ్యూల్ ప్రకటించి, ఈ షెడ్యూల్‌ను తనకు నివేదించాలని సీఎం ఆదేశించారు. ఆ గ్రామానికి సంబంధించిన రికార్డులు అదే గ్రామంలో ఉంటే సమస్యలు తగ్గుతాయని సీఎం పేర్కొన్నారు.

మహారాష్ట్రలో దారుణం

ప్లైవుడ్ షీట్స్ మీదపడి ఇద్దరు బాలికల మృతి

ముంబై,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో దారుణం జరిగింది. ప్లైవుడ్ షీట్లు మీదపడి అక్కాచెల్లెల్లయిన ఇద్దరు బాలికలు మృతిచెందారు. థానే జిల్లాలోని షిల్ ఏరియాలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. బాలికల తండ్రికి ప్లైవుడ్ షీట్ల గోదామ్ ఉంది. ఆదివారం రాత్రి సమయంలో బాలికలు ఇద్దరూ ప్లైవుడ్ షీట్ల పక్కనే నిద్రిస్తుండగా వాటిపై కుక్క దూకింది. దీంతో కదిలిన ప్లైవుడ్ షీట్లు బాలికలపై పడ్డాయి. ఈ ఘటనలో బాలికలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కాసేపటికే మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరణించిన బాలికల ఇద్దరి వయసు 9 ఏండ్లు, 11 ఏండ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

మూడు రాజధానుల పేరిట డ్రామా

రాజధాని కోసం కేంద్రం255కోట్లు ఇచ్చింది: రఘురామ

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,500 కోట్లు ఇచ్చిందని భీమవరం ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు. అమరావతి కోసం పోరాటం చేస్తున్న రైతులను పెయిడ్ ఆర్టిస్టులంటూ వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రైతులు, మహిళలను అవహేళన చేస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని చేసినా న్యాయం అమరావతి రైతుల వైపే ఉందని రఘురామకృష్ణంరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇకపోతే ఒకసారి రాజధానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశక మళ్లీ ఎలా చేస్తారని అన్నారు. దీనిపై వైకాపా నేత